విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు హైమావతి

గౌతంనగర్: సత్యసాయి శతజయంత్యుత్స వాల్లో భాగంగా మల్లికార్జుననగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం డాక్టర్ హైమావతి చేతుల మీదుగా పరీక్షలు చేశారు. విద్యార్థులకు టూత్‌బ్రష్, పేస్ట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏకలవ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రాధా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజయలక్ష్మి, స్కూల్ నిర్వాహకురాలు భారతి, రేణుక, భారతి, ఇందిరా, కృష్ణకుమారి, సునీత, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, సుబ్బారాయుడు, శంకర్‌రావు, ఏవీ స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని పలు కాలనీలకు చెందిన మహిళలు బీజేపీలో చేరారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు గిరిగౌడ్ ఆధ్వర్యంలో కమలానగర్, మహేష్‌నగర్ కాలనీలకు చెందిన పలువురు మహిళలు కాషాయ కండువా కప్పుకున్నారు. వీరిని డివిజన్ అధ్యక్షురాలు సంధ్యారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌లో పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. బీజేపీ నేతలు జీవీఎస్‌రావు, ఉమాశ్రీధర్, సిద్ధూరి సంపత్‌రావు, దొంతుల ప్రభాకర్, తుమ్మల నర్సిరెడ్డి, రోహిత్, సాయిప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సుధాకర్

కుషాయిగూడ: ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం కుషాయిగూడ సీడీఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ నిర్వాహకులతో కలిసి చర్లపల్లి, ఐజీమింట్ కాలనీలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. చట్టాల గురించి వివరిస్తూ.. గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు.

సేవాదృక్పథంతో వైద్యం అందించాలి

మేడిపల్లి: ఆసుపత్రులు సేవాదృక్పథంతో రోగులకు వైద్యం అందించాలని కాంగ్రెస్ నేత ఈశ్వర్‌రెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ సాయిప్రియకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బీవీఆర్ ఫిజియోథెరపీ, రియాబ్ సెంటర్‌ను శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సేవాదృక్పథంతో రోగులకు వైద్యసేవలు అందిచాలన్నారు. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులపై దాడికి పాల్పడిన వ్యక్తుల రిమాండ్

మల్లాపూర్: వాహనదారులపై దాడికి పాల్పడిన వ్యక్తులను నాచారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మణిక్‌చంద్ చౌరస్తాలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, సురేష్‌లు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో మల్లాపూర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన సద్దుల రాఘవ (22) బ్రహ్మపురి కాలనీకి చెందిన చింతల నరేష్(31) నాగేందర్‌బాబు (24) మత్తులో ద్విచక్రవాహనాన్ని ఇష్టానుసారంగా నడుపుతూ హల్‌చల్ చేశారు. వీరిని గిరిబాబు, సురేష్‌లు ప్రశ్నించగా రాళ్లతో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆర్‌యూబీ నిర్మాణమెప్పుడో ?

వాహనదారులకు తప్పని తిప్పలు

- రోజూ గేటు పడటంతో వాహనాలకు అంతరాయం
- అత్యవసర సేవలకు సైతం ఆటంకం



గౌతంనగర్ లెవల్ క్రాసింగ్ వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

గౌతంనగర్: గౌతంనగర్ గేటు వద్ద వాహనదారులు, ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. గేటు పడిన ప్రతిసారి గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. గేటు పడిందంటే వాహనారులు హడలిపోతున్నారు. అత్యవసర సమయాల్లో గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రైలు వచ్చే సమయంలో గేటువేసి ఉన్నప్పటికీ త్వరగా వెళ్లాలన్న అత్రుతతో కొంతమంది ద్విచక్ర వాహనదారులు నిబంధనలు పాటించకుండా గేటు కింది నుంచి వెళ్తూ.. రైలు ప్రమాదాలకు గురౌతున్నారు.

నిత్యం రైళ్ల రాకపోకలు..

ప్రతిరోజు సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే జంక్షన్‌తో పాటు ఇతర ప్రాంతాలను నుంచి మల్కాజిగిరి రైల్వేస్టేషన్ మీదుగా దేవగిరి, అజంతా, కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు డెమో, గూడ్స్ రైళ్లు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. దీనివల్ల ప్రతి 10, 15 నిమిషాలకోసారి గేటు పడుతోంది. దీనివల్ల గౌతంనగర్, దయానంద్‌నగర్, ఏకలవ్యనగర్, ఇందిరానెహ్రూనగర్ ప్రాంతాలతో పాటు మల్కాజిగిరితో పాటు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు, కళాశాల, పాఠశాల విద్యార్థులు, ఉద్యోగస్తులతో పాటు అత్యవసర వాహనాలైన 108, ఫైర్ వంటి వాహనాలు గేటుపడిన ప్రతిసారి గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గౌతంనగర్ గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

ప్రతిపాదనలకు స్పందన కరువు..

గౌతంనగర్ గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు రైల్వే, ఆర్‌అండ్‌బీ, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్‌శాఖల అధికారులకు పలుమార్లు నివేదికలుతో పాటు వినతి పత్రాలు ఇచ్చిన నేటి వరకు ఆర్‌యూబీ నిర్మాణ ప్రతిపాధనలు కలగానే మిగిలాయి.

ప్రతిరోజు అవస్థలు పడుతున్నాం.



గౌతంనగర్ లెవల్ క్రాసింగ్ వద్ద నిత్యం గేటు పడుతుండటంతో నరకయాతన పడుతున్నాం. గేటు పడిన ప్రతిసారి 2-3 రైళ్లు వెళ్తుండటంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గమ్యస్థానాలకు వెళ్లాలంటే ఆలస్యమవుతుంది. విద్యార్థులు, ఉద్యోగస్తులు సైతం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– వెంకటేశ్వర్లు, వాహనదారుడు

ఆర్‌యూబీని నిర్మించి సమస్యను పరిష్కరించాలి



గౌతంనగర్ గేటు వద్ద దశాబ్దాల కాలంగా నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి. గత కొంతకాలంగా వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు వచ్చి ఆర్‌యూబీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. కానీ నేటి వరకు కార్యరూపం దాల్చలేదు.

– అనిల్‌గుప్తా, వాణీనగర్

హోమియోపతి వైద్యం సురక్షితం

ప్రభుత్వ ఆయుష్ అదనపు డైరెక్టర్ డాక్టర్ లింగరాజు



హోమియో ఎక్స్‌పో ప్రదర్శనను ప్రారంభిస్తున్న డాక్టర్ లింగరాజు

రామంతాపూర్: హోమియోపతి వైద్య విధానం సురక్షితమైందని, వివిధ వ్యాధులకు చికిత్సలు నిర్వహించేటప్పుడు శరీరంలోని ఇతర విభాగాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావాలను చూపని ఏకైక వైద్య విధానమని తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ అదనపు డైరెక్టర్ డాక్టర్ లింగరాజు అన్నారు. శుక్రవారం రామంతాపూర్ ప్రధాన రహదారి ఆవరణలో ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాల ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హోమియో ఎక్స్‌పో ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సౌమ్యమైన సంపూర్ణమైన పద్ధతిలో అతి తక్కువ ఖర్చుతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ఆరోగ్యం కాపాడే వైద్య విధానం హోమియోపతి అని కొనియాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, ఎక్స్‌పో కో ఆర్డినేటర్ డాక్టర్ పార్థసారథి, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

బోడుప్పల్: నేరాలను అదుపుచేయడంలో సీసీకెమెరాలు ఎంతో దోహదపడతాయని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. బోడుప్పల్ ఈస్ట్ బాలాజీహిల్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆమె మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రతకోసం ప్రతి ఒక్కరూ సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. దొంగతనాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కొన్ని కాలనీల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల పూర్తిగా దొంగతనాలను అరికట్టగలిగామన్నారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సుమన్‌నాయక్, ఎస్సై తిరుపతిరెడ్డి, నేతలు మోహన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిద్దాం

బోడుప్పల్: ఆరోగ్యకరమైన వాతావరణానికి నగర పాలక సంస్థను పరిశుభ్రంగా ఉంచుదామని బోడుప్పల్ కమిషనర్ శైలజ పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం కీలక ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యకలాపాల నిమిత్తం ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల ప్రాంతాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ స్పెషల్ డ్రైవ్ వల్ల ఇంటెన్సివ్ డ్రైవ్, పరిశుభ్రతను పెంపొందించడం, ప్రోత్సహించడం, పారిశుద్ధ్య పద్ధతుల గురించి ప్రజలకు అవగాహన పెంచడం లక్ష్యంగా చేపట్టామన్నారు. చెత్త సమస్య ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో సెన్సార్ ఆధారిత సీసీటీవీ, కెమెరాలు, ఆటోమేటెడ్ వాయిస్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రాకర్స్ దుకాణదారులు నిబంధనలు పాటించాలి

మల్కాజిగిరి: నిబంధనల మేరకే క్రాకర్స్ దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో దుకాణాల ఏర్పాటుదారులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. పోలీస్, అగ్నిమాపకవిభాగం, జీహెచ్ఎంసీ విభాగాల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. నిషేధిత క్రాకర్స్, ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ నిబంధన ప్రకారం విక్రయించొద్దన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన



కాప్రా: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కాప్రా విజయసూకల్‌లో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్త్రీలకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, ఇన్నారెడ్డి, విజయస్కూల్ వ్యవస్థాపకురాలు విజయలక్ష్మి, కరస్పాండెంట్ రాజేశ్వర్, డైరెక్టర్ వీణ, హేమలత, కృష్ణారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గ్రీన్ దీపావళి



కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, వేంకటేశ్వరనగర్ కాలనీలోని హ్యాపీ చాంప్స్ ప్లే స్కూల్‌లో శుక్రవారం గ్రీన్ దీపావళిని ఘనంగా నిర్వహించారు. స్థానిక నేత దూసరి నవీన్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టతను వివరించారు. టపాసులు పేల్చడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. ఈ దీపావళి రోజు ప్రతి ఇంట్లో ఓ మొక్క నాటి గ్రీన్ దీపావళి నిర్వహించుకోవాలన్నారు. శబ్ద, వాయు కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆయన కోరారు. శ్రీశైలంయాదవ్, స్కూల్ ప్రిన్సిపాల్ రాధిక, సిబ్బంది శ్రీవిద్య, జేమ్స్ శైలాగ్లోరి, సారా సుల్తానా, హిమబిందు, వెంకటరమణ, బిందు, లావణ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే కార్యకర్తలకు గుర్తింపు

మల్కాజిగిరి: కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలోనే గుర్తింపు సాధ్యమని ఏఐసీసీ అబ్జర్వర్ డాక్టర్ అంజలి నింబల్కర్ అన్నారు. శుక్రవారం ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇతర పార్టీల్లో పదవులు వారి ఇష్టం వచ్చిన వారికి పంపకాలు చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తల అభిప్రాయ సేకరణ చేయడమే కాకుండా పార్టీకి కష్టపడిన వారికి పదవులు వస్తాయన్నారు. నూతన అధ్యక్షుడి ఎన్నికపై అభిప్రాయ సేకరణ, ఓటింగ్ నిర్వహించారు. మైనంపల్లి నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీకోసం పనిచేయాలన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇందిర, డీసీసీ మేడ్చల్ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, నాయకులు అశోక్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, చంద్రశేఖర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ స్వర్ణ

మల్లాపూర్: నాచారం డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థిని కైరా ఈనెల 28న అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో జరగబోయే జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు రాష్ట్రం నుంచి ఎంపికైంది. 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర చాంపియన్ అండర్– 17లో 42 కేజీల విభాగంలో కైరా పాల్గొని బంగారు పతకం సాధించింది. శుక్రవారం పాఠశాల చైర్మన్ నవనీతారావు, ప్రిన్సిపాల్ స్వర్ణ విద్యార్థినిని సత్కరించి అభినందించారు.

డివిజన్ అభివృద్ధికి తోడ్పాటునందిస్తా



చర్లపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి సంపూర్ణ తోడ్పాటును అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని చర్లపల్లి, ఆఫీసర్స్ కాలనీ, నాగర్జుననగర్‌కాలనీ, మీనాక్షినగర్ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తిచేయాలన్నారు. బీఆర్ఎస్ నేతలు మహేష్‌గౌడ్, డప్పు గిరిబాబు, నర్సింహ్మా, గంప కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కమిటీ ప్రతినిధులు

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బోడుప్పల్ నగర పాలక సంస్థ అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు వై.బాల్‌రాజుగౌడ్ అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కమిటీ ప్రతినిధులు శుక్రవారం కమిషనర్ శైలజ, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోడుప్పల్‌లో పలు కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. శంకరయ్య, లక్ష్మయ్య, జంగయ్య, అమృతం, రామస్వామి, ఆగమయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.



తాగునీటి కటకట !

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, శివసాయినగర్ కాలనీవాసులు గత నెలరోజులుగా తాగునీటి కటకటతో ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఆగ్రహించిన మహిళలు తప్పని పరిస్థితుల్లో శుక్రవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసనకు దిగారు. న్యాయం చేయాలంటూ.. నినాదాలు చేశారు. డీమార్ట్ వద్ద తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా శివసాయినగర్ కాలనీలోని కొంతభాగం కలుషిత తాగునీరు సరఫరా కావడంతో సరిపడా తాగునీరు కూడా రావడం లేదని తెలిపారు. గతనెలరోజులుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని సీసీఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి కోరారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి

మల్కాజిగిరి: జిల్లా కేంద్రం ఆసుపత్రిలో లాండ్రీని కాలనీ ప్రజలకు ఇబ్బంది లేకుండా నియమించాలని కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆసుపతి వద్ద స్థానికులతో కలిసి ఆందోళన చేపట్టారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసులతో ఇళ్లను ఆనుకుని రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టడం సరికాదన్నారు. పేషంట్లకు ఉపయోగించే దుస్తులను ఉతికే ప్రాంతం కాలనీ ప్రజలకు ఇబ్బందిలేకుండా చూడాల్సిన బాధ్యత వారిదేనన్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు లేఅవుట్ కాపీ అందజేసి ఫిర్యాదు చేశామన్నారు. డాక్టర్ సంగీత్, ఏసీపీ శ్రీనివాస్, ఏఈ నవీన్, వీఐ రమేష్, రాజు, కల్యాణి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, రామకృష్ణ, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ బెల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ మల్లాపూర్ విలేజ్ ఫీడర్‌లో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. భవానీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు , 11 కేవీ నోమా ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 4.30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నాచారంలో...

నాచారం ఇండోర్ (కాకతీయ కర్షక్) సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సాయిబాబా దేవాలయం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నపూర్ణ కాలనీ, రాఘవేంద్రనగర్, ఇందిరానడర్, రవీంద్రనగర్ మెయిన్ రోడ్ ఏరియాలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.

బోడుప్పల్: వివేకానందనగర్ ఫీడర్ పరిధిలో పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్–2 పరిధిలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ బాలరాజు తెలిపారు. వాసవీశివనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

మల్కాజిగిరి: మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కృష్ణానగర్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మేడిపల్లి: 11కేవీ వెంకటసాయినగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా 33/11కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు కరెంటు నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించగలరని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

కాప్రా: సైనిక్‌పురి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా పలు కాలనీలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం



కమలానగర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కాప్రా: కార్మిక చట్టాల పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ చట్టాలు కార్మికుల హక్కుల హరించే విధంగా ఉన్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఈనెల 25, 26న నిర్వహించే సీఐటీయూ జిల్లా 4వ మహాసభల సందర్భంగా శుక్రవారం ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ హాల్‌లో రెండ్రోజుల పాటు కొనసాగుతాయని ప్రకటించారు. సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, ఉన్ని కృష్ణ, గణేష్, బీవీ సత్యనారాయణ, ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయండి

బీసీలకు 42శాతం రిజర్వేషన్ డిమాండ్ చేస్తూ.. నేడు రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపు మేరకు శుక్రవారం ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో పలు పార్టీల బీసీ నేతలు సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేడు జరగబోయే బంద్‌లో శాంతియుతంగా నిరసన చేపట్టాలని పలు జేఏసీల నాయకులు పిలుపునిచ్చారు. బీసీ జాతిని ఏకతాటిపైకి తెచ్చి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల బృందం



మల్లాపూర్‌లో పూలే విగ్రహం వద్ద బీసీ నాయకులు



అల్వాల్ జేఏసీ శిబిరం వద్ద..



కుషాయిగూడలో అభివాదం చేస్తున్న బీసీ జేఏసీ నేతలు